సాక్షి ఆదిలాబాద్

మంగళవారం | 10 | డిసెంబర్ | 2024

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దస్నాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఓల్డేజ్ హోం నడిపించేందుకు స్వచ్ఛంద సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి సబిత ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 నుంచి 17 వరకు ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 08732-222058 లో సంప్రదించాలని సూచించారు.



కంది.. దిగుబడిపై రంది

9లో▸

వాతావరణంలో వస్తున్న మార్పులు కంది పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రస్తుతం చలి తీవ్రత తగ్గి పురుగు ఉధృతి పెరగడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు.

గరిష్టం/కనిష్టం
26.0/11.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. చలి తీవ్రత పెరగనుంది. వేకువజామున పొగమంచు ప్రభావం కనిపించనుంది.

న్యూస్‌రీల్

రైతుభరోసా అమలు చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్, పక్కన ఎమ్మెల్యేలు హరీశ్‌బాబు, రామారావు

ఆదిలాబాద్: రైతులకు పెట్టుబడి సాయం అందించే రైతు భరోసా పథకాన్ని వెంటనే అమలు చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సోమవారం అసెంబ్లీ సమావేశాలకు బీజేపీ ఎమ్మెల్యేలు పాల్వాయి హరీశ్‌బాబు, పవార్ రామారావుతో వినూత్నంగా ట్రాక్టర్‌పై వెళ్లి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెట్టుబడి సాయం అందక అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వారి సమస్యల తీవ్రత తెలియజేయాలని ఉద్దేశంతో ట్రాక్టర్‌పై వచ్చినట్లు వివరించారు.

15, 16 తేదీల్లో గ్రూప్-2 పరీక్షలు

కైలాస్‌నగర్: టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16 తేదీల్లో గ్రూప్-2 పరీక్షలు నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ శ్యామలాదేవి ప్రకటనలో తెలిపారు. రెండు రోజులు, నాలుగు సెషన్లలో నిర్వహించనున్న పరీక్షలకు జిల్లాలో 29 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 15న ఉదయం పేపర్-1 (జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్), మధ్యాహ్నం పేపర్-2 (హిస్టరీ, పాలిటీ అండ్ సొసైటీ), 16న ఉదయం పేపర్-3 (ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్), మధ్యాహ్నం పేపర్-4 (తెలంగాణ మూవ్‌మెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్)పై పరీక్షలు ఉంటాయని తెలిపారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. హాల్‌టికెట్లను సోమవారం నుంచి టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అలాగే అభ్యర్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలని, గంటన్నర ముందుగానే లోనికి అనుమతించనున్నట్లు తెలిపారు.

'ఇందిరమ్మ' సర్వే షురూ



సర్వే ప్రకియను పరిశీలిస్తున్న కమిషనర్

కైలాస్‌నగర్: ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన క్షేత్రస్థాయి సర్వే జిల్లాలో సోమవారం ప్రారంభమైంది. ప్రజాపాలనలో అందించిన దరఖాస్తుల ఆధారంగా ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. దరఖాస్తుదారుల ఇళ్ల వద్దకు వెళ్లిన మున్సిపల్, పంచాయతీ సిబ్బంది తొలిరోజు జిల్లా వ్యాప్తంగా 42 దరఖాస్తులను పరిశీలించారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో 15 దరఖాస్తులను పరిశీలించి వారి వివరాలు యాప్‌లో నమోదు చేశారు. తలమడుగు మండలంలో 15దరఖాస్తులను పరిశీలించగా 13 అప్లికేషన్ల వివరాలను యాప్‌లో నమోదు చేశారు. ఆదిలాబాద్‌రూరల్‌లో మూడు దరఖాస్తులు పరిశీలించి రెండింటి సమాచారం నమోదు చేసి మరో దాని కొంత సమాచారం సేకరించారు. భీంపూర్ మండలంలో రెండింటిని యాప్‌లో నమోదు చేశారు. ఇచ్చోడలో నాలుగు, సిరికొండలో ఒకటి, ఉట్నూర్‌లో రెండు దరఖాస్తుల సమాచారాన్ని సేకరించినా ఇంకా యాప్‌లో నమోదు చేయలేదు. మొత్తంగా 42 దరఖాస్తులను పరిశీలించి 32 దరఖాస్తుల సమాచారాన్ని యాప్‌లో నమోదు చేశారు. పది దరఖాస్తుల సమాచారాన్ని సేకరించారు. బజార్‌హత్నూర్, బేల, బోథ్, గాదిగూడ, గుడిహత్నూర్, ఇంద్రవెల్లి, జైనథ్, మావల, నార్నూర్, నేరడిగొండ, తాంసి మండలాల్లో తొలి రోజున సర్వే ప్రారంభించలేదు. పంచాయతీ కార్యదర్శులు తమకు ప్రభుత్వపరంగా ఆదేశాలు వస్తేనే సర్వే చేస్తామని అధికారులకు వినతిపత్రాలు అందజేసిన నేపథ్యంలో ఈ సర్వే నిర్వహణపై సందిగ్ధత నెలకొంది. జిల్లాలోని 18మండలాల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 1,97,448దరఖాస్తులు అందాయి. వీటన్నింటిని అధికారులు పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు.

లిఖితపూర్వక ఆదేశాలివ్వాలి

కైలాస్‌నగర్: ప్రభుత్వం నిర్దేశించిన ప్రతీ పనిని పూర్తి చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అయితే ప్రభుత్వం తమకు లిఖితపూర్వక ఉత్తర్వులు జారీ చేయాలని తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంజీవ్‌రావు, దుర్గయ్య డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. అనంతరం డీపీవో, అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఇందులో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో సోయాబీన్‌ను జల్లెడ పట్టి కుప్పలు పోస్తున్న దృశ్యం (ఫైల్)

సోయా లక్ష్యం పెరిగేనా..?

- కోటాకు అదనంగా కొనుగోలు చేయాలని కేంద్రానికి ప్రతిపాదనలు
- పెంచితే రైతులకు ఊరట
- ప్రైవేట్‌తో పోల్చితే ప్రభుత్వ మద్దతు ధరే అధికం
- మార్క్‌ఫెడ్‌లో కొనసాగుతున్న కొనుగోళ్లు
- జిల్లాలో మూతపడ్డ రెండు కేంద్రాలు

సాక్షి,ఆదిలాబాద్: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నాఫెడ్‌కు అనుబంధంగా రాష్ట్రంలో మార్క్‌ఫెడ్ సోయా కొనుగోళ్లు చేస్తున్న విషయం తెలిసిందే. జిల్లాలో తొమ్మిది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఇప్పటివరకు లక్షల క్వింటాళ్లు కొనుగోలు చేసింది. అయితే రెండు కేంద్రాలను మార్క్‌ఫెడ్ అక్కడ పంట దిగుబడులు పూర్తయ్యాయని కొనుగోళ్లను నిలిపివేసింది. ఇదిలా ఉంటే జిల్లాలో మార్క్‌ఫెడ్ ద్వారా అదనంగా రైతుల నుంచి పంట కొనుగోలు కోసం అనుమతి ఇవ్వాలని అదనపు కలెక్టర్ నుంచి కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. అక్కడి నుంచి అనుమతి వస్తే మరింత వేగంగా కొనుగోళ్లు జరిగే అవకాశం ఉంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో అక్టోబర్ 7న సోయా కొనుగోళ్లు మొదలయ్యాయి. మొత్తంగా 9 సెంటర్లు ఏర్పాటు చేయగా, అందులో ఆదిలాబాద్‌లో మొదట ప్రారంభించారు. ఆ తర్వాత తాంసి, బేల, జైనథ్, ఇచ్చోడ, బోథ్, ఇంద్రవెల్లి, నార్నూర్, నేరడిగొండలో షురూ చేశారు. కేంద్రం సోయా క్వింటాలుకు మద్దతు ధర రూ.4,892 ఇస్తుంది. అయితే ప్రైవేట్‌లో రూ.4,100లోపే ఉండడంతో రైతులు ప్రభుత్వరంగ సంస్థకే పంటను విక్రయించేందుకు మొగ్గుచూపుతూ వస్తున్నారు. ఇదిలా ఉంటే తాజాగా రెండు సెంటర్లను మార్క్‌ఫెడ్ మూసివేసింది. మరోవైపులక్ష్యం పెంచాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. దానికి సంబంధించి ఉత్తర్వులు వచ్చిన పక్షంలో మిగిలిన సెంటర్లలో మార్క్‌ఫెడ్ సోయాను పెద్ద ఎత్తున కొనుగోలు చేసేందుకు అవకాశం ఉంది. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం నుంచి కొంతమేరకు సోయా కొనుగోలు చేసే పరిస్థితి ఉంటుందని మార్క్‌ఫెడ్ అధికారులు అభిప్రాయ పడుతున్నారు.

దిగుబడి అధికం..

జిల్లాలో 24,301 మంది రైతులు 65,306 ఎకరాల్లో సోయా సాగు చేశారు. 5,00,920 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. అయితే ఇప్పటివరకు 2లక్షల 70వేల క్వింటాళ్లను మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసింది. ఇదిలా ఉంటే అదనపు కొనుగోళ్లకు సంబంధించి ప్రతిపాదనలు వెళ్లినప్పటికి వాటికి గ్రీన్‌సిగ్నల్ లభిస్తే మార్క్‌ఫెడ్ మిగతా కొనుగోళ్ల వేగిరం పెంచే అవకాశం ఉంది. తద్వారా జిల్లా రైతులకు మద్దతు ధర లభించే అవకాశాలు ఉన్నాయి.

అదనంగా 60వేల క్వింటాళ్ల కోసం..



జిల్లాలో రెండు సెంటర్లు మినహా ప్రారంభించిన మిగతా అన్ని సెంటర్లలోనూ సోయా కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. అదనంగా 60వేల క్వింటాళ్లు కొనుగోలు చేయాలని కేంద్రానికి ప్రతిపాదనలు జిల్లా ఉన్నతాధికారుల ద్వారా పంపాం. దానికి అనుమతి లభిస్తుందని ఆశిస్తున్నాం. అంతేకాకుండా ఇప్పటివరకు కొనుగోలు చేసిన పంటకు సంబంధించి వేగిరంగా రైతులకు డబ్బులు అందేలా చూస్తున్నాం.

– ప్రవీణ్‌రెడ్డి, డీఎం మార్క్‌ఫెడ్, ఆదిలాబాద్

సైబర్ బాధితులకు అండగా ఉంటాం

- ఎస్పీ గౌస్ ఆలం
- సైబర్ క్రైమ్ కార్యాలయం ప్రారంభం



సైబర్‌క్రైమ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: సైబర్ బాధితులకు అండగా ఉంటూ న్యాయం చేకూర్చేలా పోలీసుశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. జిల్లాకేంద్రంలోని పోలీసు కార్యాలయంలో నూతన సైబర్‌క్రైమ్ కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సైబర్ బారిన పడిన వెంటనే టోల్‌ఫ్రీ నం.1930కు సమాచారం అందించాలన్నారు. అలాగే సైబర్‌క్రైమ్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఈమేరకు ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈఏడాది జిల్లాలో సైబర్ బారిన పడిన 90 మంది బాధితులకు రూ.17,62,381 లను తిరిగి న్యాయశాఖ సహకారంతో వారికి అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.సురేందర్ రావు, డీఎస్పీలు ఎల్.జీవన్‌రెడ్డి, హసీబుల్లా, పోలీసు కార్యాలయం ఏవో భక్తప్రహ్లాద్, సూపరింటెండెంట్లు సంజీవ్, గంగాధర్, ఇన్‌స్పెక్టర్లు డి.సాయినాథ్, కరుణాకర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, సైబర్‌క్రైమ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అర్జీల వెల్లువ

- గ్రీవెన్స్‌లో వినతులు స్వీకరించిన అదనపు కలెక్టర్
- ఈ వారం ప్రజావాణికి 78 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

కైలాస్‌నగర్: పింఛన్ మంజూరు చేయాలని ఒకరు... స్వయం ఉపాధి కల్పించాలని మరొకరు.. భూ సమస్య పరిష్కరించాలని ఇంకొకరు.. ఇలా వివిధ సమస్యలతో తరలివచ్చిన అర్జీదారులు తమ గోడును జిల్లా అధికారులకు మొరపెట్టుకున్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. బాధితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని దేశించారు. ఆయా సమస్యలపై ఈ వారం మొత్తం 78 అర్జీలు అందినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో అత్యధికంగా పింఛన్‌కు సంబంధించినవే ఉండడం గమనార్హం. కార్యక్రమంలో ఆర్డీవో వినోద్‌కుమార్, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ వారం అర్జీదారుల్లో కొందరి నివేదన..

పట్టించుకోవడం లేదు



నా పేరు చిటిమెల్ల నర్సబాయి. జైనథ్ మండలంలోని భోరజ్ గ్రామం. నాకు గ్రామ శివారులోని సర్వే నంబర్ 28లో ఎకరం భూమి ఉంది. 1995 నుంచి ఆ భూమిని సాగు చేసుకుంటున్నా. కానీ ధరణి వెబ్‌సైట్‌లో కనిపించడం లేదు. తహసీల్దార్‌కు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.

రుణమాఫీ కాలే..



మాది ఉట్నూర్ మండలం శ్యాంపూర్ గ్రామం. మా ఊరికి చెందిన 26 మంది రైతులకు పంట రుణాలు రూ.2లక్షలలోపే ఉన్నాయి. కానీ మాకు ఒక్క రూపాయి కూడా మాఫీ కాలేదు. ప్రభుత్వం రేషన్‌కార్డు ప్రమాణికంగా రుణాలు మంజూరు చేయడంతో మాకు అన్యాయం జరిగింది. దాన్ని సవరించి మాకు న్యాయం చేయాలని కోరుతున్నాం.

బకాయిలు చెల్లించాలి

మేమంతా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే స్వచ్ఛ కార్మికులం(స్కావెంజర్స్). గత ప్రభుత్వ హయంలో పంచాయతీ పరిధిలో విధులు నిర్వహించిన మూడు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని చెల్లించాలని అధికారులను వేడుకున్నా పట్టించుకోవడం లేదు. త్వరగా అందేలా చూడాలని ఇక్కడ విన్నవించాం.



పింఛన్ రావడం లేదు



మాది గాదిగూడ మండలంలోని మేడిగూడ. వితంతు, వృద్ధాప్య, దివ్యాంగ పింఛన్ కోసం గ్రామానికి చెందిన 16 మందిమి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాం. ఏండ్లు గడుస్తున్నా పింఛన్ మంజూరు కావడం లేదు. నాలుగేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. విచారణ జరిపించి న్యాయం చేయాలని కోరుతున్నాం.

ముగిసిన డేటా ఎంట్రీ ప్రక్రియ

- రాష్ట్రంలో రెండో స్థానంలో ఆదిలాబాద్



గుడిహత్నూర్ మండల కేంద్రంలో డేటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా (ఫైల్)

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సంబంధించిన డేటా ఎంట్రీ ప్రక్రియ ముగిసింది. జిల్లా వ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కలిపి వంద శాతం కుటుంబాల వివరాలను ఆపరేటర్లు సమగ్ర సర్వే వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. జిల్లాలోని 21 మండలాల పరిధిలో 2,25,257 కుటుంబాలున్నట్లుగా హౌస్ లిస్టింగ్ సర్వేలో అధికారులు గుర్తించారు. ఎన్యుమరేటర్లు ఆ కుటుంబాలకు సంబంధించిన సమాచారాన్ని ఇంటింటి సర్వే ద్వారా సేకరించారు. గత నెల 22 నుంచి సమగ్ర కుటుంబ సర్వే వెబ్‌సైట్‌లో వివరాల నమోదును ప్రారంభించిన ఆపరేటర్లు తమకు కేటాయించిన దరఖాస్తులను వంద శాతం పూర్తి చేశారు. అన్ని మండలాల్లోనూ పూర్తి కాగా రాష్ట్రంలో ఆదిలాబాద్ జిల్లా ఈ ప్రక్రియలో రెండో స్థానంలో నిలిచినట్లుగా అధికారులు చెబుతున్నారు. ప్రథమ స్థానంలో ములుగు జిల్లా ఉండగా చిట్టచివరి స్థానంలో హైదరాబాద్ జీహెచ్‌ఎంసీ నిలిచినట్లుగా పేర్కొన్నారు. ఈ సర్వే ఆధారంగానే రాష్ట్ర ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను పెంచి ఇతర అన్ని కేటగిరీలను ఖరారు చేయనుందనే అభిప్రాయాన్ని అధికారులు వెలిబుచ్చుతున్నారు.

మండలం	ఎంట్రీ పూర్తయిన కుటుంబాలు
మావల	1,758
ఆదిలాబాద్‌రూరల్	11,536
జైనథ్	8,370
భీంపూర్	7,795
బజార్‌హత్నూర్	9,620
సిరికొండ	5,652
భోరజ్	6,310
నేరడిగొండ	9,620
ఇంద్రవెల్లి	12,160
తాంసి	5,533
బోథ్	11,279
బేల	10,236
సాత్నాల	4,207
ఉట్నూర్	19,099
సొనాల	4,286
గాదిగూడ	6,739
గుడిహత్నూర్	10,179
ఇచ్చోడ	13,976
తలమడుగు	11,456
నార్నూర్	9,221
ఆదిలాబాద్‌అర్బన్	46,225

'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

- కలెక్టర్ రాజర్షి షా



అభ్యాస దీపికలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

కైలాస్‌నగర్: పదోతరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. పది విద్యార్థుల ప్రయోజనార్థం రూపొందించిన తెలుగు, ఇంగ్లిష్, హిందీ సబ్జెక్టుల అభ్యాస దీపికలను సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరీక్షలపై విద్యార్థుల్లో ఉన్న భయాన్ని తొలగించాలన్నారు. ఈ మేరకు అభ్యాసదీపికలు ఎంతో ఉపకరిస్తాయన్నారు. ఇందులో పొందుపర్చిన ముఖ్యాంశాలు, సూచనలు పాటిస్తూ ప్రణాళికాబద్ధంగా చదివి పరీక్షల్లో విజయం సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఆదిశగా సన్నద్ధమయ్యేలా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో డీఈవో ప్రణీత పాల్గొన్నారు.

విజయ డెయిరీ ఉత్పత్తులను ప్రోత్సహించాలి

ఆదిలాబాద్‌టౌన్: విజయ డెయిరీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. రిమ్స్‌లో ఏర్పాటు చేసిన విజయ డెయిరీ పార్లర్‌ను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రోగులు, వారి సహాయకులకు నాణ్యమైన పాలు, పాల ఉత్పత్తులు అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా తెలంగాణ పాడి పరిశ్రమ అభివృద్ధి సమాఖ్య ఆధ్వర్యంలో పార్లర్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. త్వరలోనే ఆదిలాబాద్ బస్టాండ్‌లోనూ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్ రావు, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, సూపరింటెండెంట్ అశోక్, డెయిరీ మేనేజర్ తుషార్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ఆదిలాబాద్‌టౌన్: పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు, పీఆర్సీ వెంటనే ప్రకటించాలని టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు సునీల్ చౌహాన్ డిమాండ్ చేశారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని వినాయక్‌చౌక్‌లో గల శిశుమందిర్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. సంఘం ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ రూపొందించి దశల వారీగా పాఠశాలల్లో నల్లబ్యాడ్జీలతో నిరసన, తహసీల్దార్లకు వినతిపత్రం సమర్పణ, కలెక్టరేట్ ఎదుట ధర్నాలు నిర్వహించామని, 17న ఇందిరాపార్కులో 5వేల మంది ఉపాధ్యాయులతో ధర్మాగ్రహ దీక్ష చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. దీక్షకు జిల్లా నుంచి ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

'సమగ్ర' ఉద్యోగుల సమ్మెబాట

- మూడు రోజులపాటు రిలే దీక్షలు
- ప్రభుత్వం నుంచి స్పందన కరువు
- నేటి నుంచి నిరవధిక సమ్మెకు సిద్ధం

'సమగ్ర' ఉద్యోగుల వివరాలు

జిల్లా	ఉద్యోగులు
ఆదిలాబాద్	607
మంచిర్యాల	513
కుమురంభీం	473
నిర్మల్	424



కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకేంద్రంలో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

కెరమెరి(ఆసిఫాబాద్): విద్యాశాఖలో కీలకంగా వ్యవహరిస్తున్న సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు సమ్మెకు సిద్ధమయ్యారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన బాటపట్టారు. ఈనెల 6 నుంచి జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు చేపట్టినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో మంగళవారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నారు. ఎమ్మార్సీ, సీఆర్సీ స్థాయిల్లో పనులకు అటంకం ఏర్పడనుంది. అలాగే కేజీబీవీలు, యూఆర్ఎస్‌ల ఉద్యోగులు కూడా సమ్మెలో పాల్గొననున్నారు.

క్రమబద్ధీకరణ కోసం..

సమగ్ర శిక్షా పరిధిలో క్లస్టర్ స్థాయి, జిల్లా స్థాయితో పాటు కేజీబీవీ, యూఆర్ఎస్‌లో రాష్ట్రవ్యాప్తంగా 19వేల మంది కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా 2017 మంది సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారు. పదేళ్లకు పైగా పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత లేక ఇబ్బంది పడుతున్నారు. ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని, అప్పటివరకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. వివిధస్థాయిల్లో వినతులు ఇచ్చినా ప్రభుత్వం పట్టించుకోవడంతో రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు ఈ నెల 6 నుంచి మూడు రోజులపాటు రిలే దీక్షలు చేపట్టారు.

సేవలకు ఆటంకం

సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం నుంచి సమ్మె చేపడుతుండటంతో విద్యాశాఖలో పలు సేవలు నిలిచిపోనున్నాయి. డీపీవో స్టాఫ్, అకౌంటెంట్స్, ఏఎస్ఎం, సీఆర్‌టీ, పీజీ సీఆర్‌టీ, స్పెషల్ ఆఫీసర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఐఈఆర్పీ, ఎంఐఎస్‌సీసీవో, పార్ట్‌టైం టీచర్లుగా వీరు విధులు నిర్వహిస్తున్నారు. కేజీబీవీ, యూఆర్ఎస్, భవిత కేంద్రాల్లో బోధన నిలిచి విద్యార్థుల చదువుపై ప్రభావం పడనుంది. డీఈవో, ఎంఈవో కార్యాలయాలు, వృత్తి విద్యా ఇన్‌స్ట్రక్టర్లు విధులకు దూరంగా ఉండనుండటంతో ఆన్‌లైన్ పనులు నిలిచిపోనున్నాయి. ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాల్లో సమగ్ర శిక్షా ఉద్యోగులు ఎంఈవోలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు ఇప్పటికే సమ్మె నోటీసులు అందించారు.

పోరాటం ఆగదు



సమ్మె నోటీసు అందించి 20 రోజులు గడుస్తోంది. క్రమబద్ధీకరణపై ఎలాంటి ప్రకటన ఇవ్వలేదు. సీఎం ఇచ్చిన హామీ నిలబెట్టుకునే వరకు పోరాటం ఆగదు.

– పదాల రవీందర్, రాష్ట్ర అధికార ప్రతినిధి

క్లుప్తంగా

మహిళ ఆత్మహత్యాయత్నం

నర్సాపూర్(జి): భర్త వేధింపులు తాళలేక చెరువులో దూకి మహిళ ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు...మండల కేంద్రానికి చెందిన పందిరి మమత, సాయన్న భార్యాభర్తలు. భర్త పెడుతున్న వేధింపులతో మనస్తాపానికి గురైన మమత సోమవారం స్థానిక బసం చెరువులో దూకింది. గమనించిన స్థానికులు పోలీస్ కానిస్టేబుల్ చౌహాన్ కృష్ణకు సమాచారం అందించగా స్థానికుల సాయంతో మహిళను బయటకు తీశారు. ప్రాథమిక చికిత్స అందించి 108లో నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మహిళ సోదరుడు గంగారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధం



మంటలు ఆర్పుతున్న స్థానికులు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండలంలోని ఆనంద్‌పూర్‌కు చెందిన పాచ్చన్న ఇంట్లో నిల్వ ఉంచిన పత్తి సోమవారం షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. బాధిత కుటుంబ సభ్యులు పంట చేనుకు వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం జరిగింది. దాదాపు 20 క్వింటాళ్ల పత్తి నిల్వ ఉండగా, గమనించిన స్థానికులు మంటలను ఆర్పివేశారు. అప్పటికే సగం వరకు పత్తి కాలిబూడిదైంది. దీంతో బాధిత రైతు కన్నీరుమున్నీరయ్యాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

తండ్రిని చంపిన తనయుడు



ముత్యం మృతదేహం

నిర్మల్‌రూరల్: తనయుడి చేతిలో తండ్రి హతమైన సంఘటన మండలంలోని ముతాపూర్‌లో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల మేరకు మండలంలోని ముతాపూర్‌కు చెందిన గుర్రం ముత్యం (47) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆదివారం రాత్రి బంధువుల ఇంట్లో జరిగిన విందుకు హాజరై ఇంటికి వచ్చాడు. తన తల్లి వెంకటమ్మను డబ్బులు ఇవ్వమని కొట్టాడు. గమనించిన అతని పెద్ద కుమారుడు మణిదీప్ నానమ్మను ఎందుకు కొడుతున్నావ్ అంటూ చీరతో గొంతు నులిమి హత్య చేశాడు. గాయపడిన వెంకటమ్మను అదేరాత్రి జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించాడు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చి తనతండ్రి గుండెనొప్పితో మృతి చెందాడని గ్రామస్తులను నమ్మించాడు. అనుమానం వచ్చిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై లింబాద్రి తమదైన శైలిలో విచారించగా నిజాన్ని ఒప్పుకున్నాడు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



అంతర్రాష్ట్ర సరిహద్దులో ఉన్న వాంకిడి చెక్‌పోస్టు

ఆగని దారి దోపిడీ!

- వాంకిడి చెక్‌పోస్టు వద్ద అక్రమ వసూళ్లు
- 'ఆర్టీఏ' తనిఖీల మాటున రూ.లక్షల్లో ఆర్జన
- ప్రైవేటు సిబ్బందితోనే యథేచ్ఛగా దందా
- అంతర్రాష్ట్ర సరిహద్దు కేంద్రంగా అవినీతి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: తెలంగాణ, మహారాష్ట్ర అంతర్రాష్ట్ర సరిహద్దు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి ఆర్టీఏ చెక్‌పోస్టులో అక్రమ వసూళ్ల పర్వం ఆగడం లేదు. ఈ చెక్‌పోస్టులో వాహనాల తనిఖీల సమయంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. వ్యవస్థీకృతంగా మారిన ఈ దారి దోపిడీతో రోజుకు రూ.లక్షల్లో జేబులు నింపుకుంటున్నారు. రవాణా శాఖ చెక్‌పోస్టు కేంద్రంగా అధికారులు అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

పోస్టింగ్‌కు పోటాపోటీ

ఒక రోజు డ్యూటీ చేస్తే రూ.లక్షలు ఇంటికి తీసుకువెళ్లే చెక్‌పోస్టు విధుల కోసం అధికారులు, సిబ్బంది అమితాసక్తి చూపిస్తారు. ప్రస్తుతం ఏడుగురు రవాణా శాఖ అధికారులు ఉన్నారు. నలుగురు ఎంవీఐ(మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్) కాగా, మరో ముగ్గురు ఏఎంవీఐ(అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్) ఉన్నారు. గతంలో ఆన్‌డ్యూటీ(ఓడీ)లు, రెగ్యులర్ విధులతో చెక్‌పోస్టుల్లోనూ పని చేశారు. ప్రభుత్వం ఓడీలు రద్దు చేసింది. దీంతో ఏడుగురు అధికారులే రోజుకు ఒకరు చొప్పున విధుల్లో ఉంటున్నారు. వీరికి ఓ కానిస్టేబుల్, ఆఫీస్ సబార్డినేట్, మరో పది నుంచి 20మంది వరకు ప్రైవేటు వ్యక్తులు పని చేస్తున్నారు. అధికారులు వాహనాల అనుమతి, లైసెన్స్‌లు, ఇన్సూరెన్స్, పన్నులు, ఓవర్ లోడ్ తదితరవన్నీ చెక్ చేసి పంపించాలి. ఏవైనా లేకుంటే నిబంధనల మేరకు జరిమానాలు వేయాలి. కానీ తనిఖీ చేశాక పర్మిట్ ఇచ్చేందుకు వాహన డ్రైవర్లను బట్టి వసూలు చేస్తున్నారు.

రోజుకు రూ.2 లక్షల నుంచి రూ.3లక్షలు

హైదరాబాద్, విజయవాడ, కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి మంచిర్యాల మీదుగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి దాటి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, బీహార్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలకు జాతీయ రహదారి 363పై నుంచి వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నాగ్‌పూర్, విజయవాడ, తెలంగాణతోపాటు ఏపీ, చెన్నయ్ వరకు వెళ్తుంటాయి.

డబ్బాలో డబ్బులు వేయిస్తూ..

ప్రైవేటు సిబ్బంది చేతులు, కర్రలు, రాత్రి వేళ స్టిక్కర్లు ఉన్న కర్రలను రోడ్డుపై చూపుతూ అంతర్రాష్ట్ర సరిహద్దు వద్ద వాహనాలు నిలిపి వేస్తుంటారు. డ్యూటీలో ఉన్న అధికారి పత్రాల పరిశీలన చేస్తుంటారు. అయితే అక్కడితో ఆగకుండా చెక్‌పోస్టు లోపల ఓ డబ్బాను ఏర్పాటు చేశారు. ఎవరి చేతికి ఇవ్వకుండా అందులో డబ్బులు వేయిస్తుంటారు. ఆ డబ్బాను గమనిస్తూ పోగైన డబ్బులను తీసుకుంటూ ఖాళీ చేస్తుంటారు. ఈ డబ్బు నుంచి రోజువారీగా ప్రైవేటు వ్యక్తుల కూలి, భోజనాలు, ఖర్చులు పోను మిగిలినవి పంచేసుకుంటున్నారు. వాహనదారుల నుంచి కూరగాయలు, గుడ్లు, బాయిలర్ కోళ్లు, పండ్లు తీసుకుంటున్నారు.

అడిగినంత ఇస్తున్నం



ఛత్తీసగఢ్ రాష్ట్రం నుంచి చెన్నయ్ వెళ్తున్న. ప్రతీసారి చెక్‌పోస్టు వద్ద నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇవ్వకుంటే ఇబ్బందులకు గురి చేస్తారనే భయంతో అడిగినంత ఇస్తున్నం.

– మనోజ్ గుప్తా, డ్రైవర్

రూ.500 తీసుకుంటున్నారు



నెలకు నాలుగైదు సార్లు మధ్యప్రదేశ్ నుంచి విజయవాడకు ఈ చెక్ పోస్టు గుండా వెళ్తుంటాం. ప్రతీసారి రూ.500తీసుకుంటున్నారు. డబ్బులు ఎందుకని అడిగితే ఏం చెప్పరు.

– వెంకటేశం, డ్రైవర్

అందరికీ మామూళ్లే..

వాంకిడి చెక్‌పోస్టులో యథేచ్ఛగా దారిదోపిడీ సాగుతున్నా ఎవరూ అడ్డు చెప్పరు. ఇందుకు అధికారులు పెద్దయెత్తున పంపకాలు చేస్తుంటారు. ఇందులో అన్ని రంగాల వారు ఉన్నారు. ప్రజాప్రతినిధుల నుంచి మొదలు ఎన్నికల్లో ఓడిపోయిన నాయకుల దాకా డబ్బులు అందుతుంటాయి. జిల్లా, ఉమ్మడి జిల్లాలో ఆ వ్యక్తిని బట్టి కనీసం రూ.5వేల నుంచి లక్ష దాకా మామూళ్లు ఇస్తున్నట్లు సమాచారం. దీంతో అందరూ కళ్లు మూసుకున్నట్లుగా ఉంటున్నారు. ఈ అక్రమ దందాపై ఏసీబీ, ఉన్నతాధికారులు దృష్టి సారించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఒక్కో బండి నుంచి రూ.500 నుంచి రూ.600వరకు వసూలు చేస్తున్నారు. రోజూ వందలాది వాహనదారుల నుంచి అక్రమంగా వసూలు చేస్తున్న సొమ్ము రూ.2లక్షల నుంచి రూ.3లక్షల దాకా ఉంటోంది. నెలకు అరకోటి పైనే. రద్దీ వేళల్లో ఇంకా అదనంగానే ఉంటోంది.

మంచిర్యాలలోనే స్పీడ్ పోస్ట్ సేవలు

- ఆర్‌ఎంఎస్ కార్యాలయం జిల్లా కేంద్రంలోనే కొనసాగేలా ఉత్తర్వులు

సాక్షి ఎఫెక్ట్..

పాతమంచిర్యాల: స్పీడ్‌పోస్ట్ సేవలు, ఉత్తరాల బట్వాడా ఇకనుంచి మంచిర్యాల నుంచే జరుగనున్నాయి. డిసెంబర్ నెలాఖరు నుంచి ఉత్తరాలు, పార్శిళ్లు త్వరగా గమ్యస్థానాలకు చేరే అవకాశం ఉంది. 2016 వరకు జిల్లా కేంద్రంలోనే కొనసాగిన స్పీడ్ పోస్టాఫీస్ (ఇంట్రా సర్కిల్ హబ్)ను అధికారులు వరంగల్‌కు తరలించారు. దీంతో ఉమ్మడి నాలుగు జిల్లాల పరిధిలో ఒక్కరోజులోనే అందాల్సిన ఉత్తరాలు మూడు నుంచి నాలుగు రోజులు ఆలస్యంగా అందేవి. కొన్నిసార్లు పోస్టల్ బ్యాలెట్లు కూడా లెక్కింపు సమయానికి కేంద్రాలకు అందని సంఘటనలు ఉన్నాయి. తాజాగా జిల్లాలో ఆర్‌ఎంఎస్ సేవలను కూడా ఇక్కడి నుంచి వరంగల్‌కు తరలించాలని తపాలాశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. విషయాన్ని ముందే గ్రహించిన 'సాక్షి' నవంబర్ 08న 'డిస్ట్రిబ్యూషన్ తరలింపు' శీర్షికన కథనాన్ని ప్రచురించింది. దీంతో ప్రజాప్రతినిధులు స్పందించారు. తపాలాశాఖ ఉన్నతాధికారులు సైతం జిల్లా అధికారులతో సంప్రదింపులు జరిపి కార్యాలయం తరలింపుపై అభిప్రాయాలు సేకరించారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు తపాలాశాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అంతేకాకుండా ఆర్‌ఎంఎస్ కార్యాలయం, స్పీడ్ పోస్టాఫీస్‌ను జిల్లా కేంద్రంలో కొనసాగించాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ నవంబర్ 23న కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు విన్నవించారు. దీనిపై తపాలాశాఖ ఉన్నతాధికారులు పునరాలోచన చేశారు. రెండు కార్యాలయాలు ఇక్కడి నుంచే కొనసాగించాలని డిసెంబర్ 5న కేంద్ర కమ్యూనికేషన్‌ల మంత్రిత్వశాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ (మెయిల్ ఆపరేషన్స్) హరిఓం శర్మ ఉత్తర్వులు జారీ చేశారు. సాక్షి కథనంతోనే ఆర్‌ఎంఎస్ కార్యాలయం జిల్లా నుంచి తరలిపోకుండా నిలిచిందని ఈ సందర్భంగా ఉద్యోగులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగం రెగ్యులర్ కాలేదని ఆత్మహత్య..

- 510 జీవోతో అన్యాయం జరిగిందని ఆవేదన..
- తన చావుతో అయినా మిగతా వారికి న్యాయం జరగాలని సూసైడ్ నోట్



భరత్ (ఫైల్)

నిర్మల్‌టౌన్: వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో ఆరేళ్లుగా పనిచేస్తున్న ఓ ఉద్యోగి.. తనకన్నా జూనియర్లు రెగ్యులర్ అయ్యారని, తనకు మాత్రం అన్యాయం జరిగిందని మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ముందు సూసైడ్ నోట్ రాశాడు. ఈ ఘటన నిర్మల్ జిల్లాలో సోమవారం సాయంత్రం జరిగింది. జిల్లా కేంద్రానికి చెందిన వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగి వకులాభరణం భరత్‌కుమార్ (37) ఇంట్లో ఉరేసుకున్నాడు. ఆత్మహత్యకు ముందు భరత్ రాసిన ఓ సూసైడ్ లేక అందరినీ కంటతడి పెట్టిస్తోంది.'మా అమ్మానాన్నల కడుపులో పుట్టడం నా అదృష్టం. ఎంతో పెద్ద ఉద్యోగం వస్తుందని కలలు కన్నాను. 2018 లో ఆరోగ్యశాఖలో ఆర్‌ఎన్టీసీపీ విభాగంలో సీనియర్ ట్రీట్మెంట్ ల్యాబ్ టెక్నీషియన్‌గా ఉద్యోగం పొందాను. జీవితంలో స్థిరపడతానని ఆశించాను. కానీ నాకన్నా హోదా తక్కువ ఉన్న వారికి ఇదే శాఖలో జీతం ఎక్కువగా రావడం.. నా జీతం మాత్రం పెరగకుండా కాంట్రాక్ట్ పద్ధతిలోనే ఉండిపోవడంతో తీవ్రంగా నిరాశ చెందాను. నాతోపాటు నాలాంటి వాళ్లను రెగ్యులర్ చేసే విషయంలో జీవో 510 అన్యాయం చేసింది. అప్పటి ప్రభుత్వంలో వచ్చిన ఈ జీవో వల్ల నష్టపోయాం. ఇటీవల జీవో 16 కూడా అమలు చేయవద్దని ఉత్తర్వులు వచ్చాయి. దీంతో మాకు తీరని అన్యాయం జరిగింది. ఉద్యోగం రెగ్యులర్ అవుతుందని ఎంతో ఆశతో ఎదురు చూశా. కానీ అది జరగక పోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యా. నా భార్య పల్లవికి అన్యాయం చేస్తున్నా. కుమారుడు దేవాను వీడిపోతున్నా. మీ ఇద్దరినీ బాగా చూసుకుంటానని కలలు కన్నా. కానీ ఉద్యోగం రెగ్యులర్ కాకపోవడంతో మీకు చెప్పినట్లుగా ముందుకు వెళ్లలేకపోయా. ఇంతకాలం పనిచేసిన కాలంలో నాకు రావాల్సిన పీవోఎల్ బకాయిలు నా భార్యకు ఇవ్వండి. నా ఆత్మహత్యతో అయినా మిగతా వారికి న్యాయం జరగాలి. ఈ విషయాన్ని రాష్ట్ర స్థాయిలో తెలిసేలా చూడండి. సహచర ఉద్యోగులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు అందరికీ రుణపడి ఉంటా. అమ్మా నాన్న సారీ..' అంటూ సూసైడ్ నోట్ రాశాడు. భరత్ మృతి ఆరోగ్య శాఖ ఉద్యోగుల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

హక్కుల సాధనకు పోరాడుదాం

- ఆదివాసీ అస్తిత్వ పోరు గర్జన సభలో ఆదివాసీ పెద్దలు



సంప్రదాయ నృత్యం చేస్తున్న విద్యార్థినులు



అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పిస్తున్న ఆదివాసీ నాయకులు

ఇంద్రవెల్లి(ఖానాపూర్): రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధనకు సమన్వయంతో పోరాడుదామని ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) రాష్ట్ర నాయకులు, ఆదివాసీ పెద్దలు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అమరులకు నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివాసీల న్యాయమైన హక్కులు, సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించని పక్షంలో ఏప్రిల్ 10 తర్వాత ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం నుంచే మరో ఉద్యమం ప్రారంభిస్తామన్నారు. చట్టబద్ధత లేని లంబాడీల ఎస్టీ హోదా రద్దు చేయాలని, జైనూర్ మండల కేంద్రంలో 1970 తరువాత వలస వచ్చిన మైనార్టీలను వెంటనే తరలించాలని, ఆదివాసీలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, 5వ షెడ్యూల్డ్ ప్రాంతంలో 1/70, పెసా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ బుర్స పోచ్చయ్య, రాష్ట్ర కో కన్వీనర్ గోడం గణేశ్, గోండ్వాన పంచాయతీ రాయిసెంటర్ జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు, మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగ్‌రావ్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు దాదిరావ్, కోశాధికారి కొట్నాక్ బారిక్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్టు



గంజాయి చూపిస్తున్న సీఐ సునీల్‌కుమార్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఎరోడ్రమ్ సమీపంలో సోమవారం గంజాయి విక్రయించేందుకు వెళ్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు.ఆదిలాబాద్ రూరల్ మండలంలోని దారులొద్దికి చెందిన గేడం సురేష్, సిడాం సురేష్, బేల మండలంలోని గర్కగూడెంకు చెందిన మేస్రం శ్రీహరి 3.800 కిలోల గంజాయిని పట్టణంలో విక్రయించేందుకు బైక్‌పై వెళ్తుండగా పక్కా సమాచారం మేరకు కాపు కాసి వారిని పట్టుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. వారి వద్ద నుంచి గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. దాడుల్లో వన్‌టౌన్ ఎస్సైలు అశోక్, ఇసాక్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురు..



నిందితుల అరెస్టు చూపిస్తున్న సీఐ అఫ్జలుద్దీన్

బెల్లంపల్లి: బెల్లంపల్లి కోల్ కెమికల్ ఏరియా ప్రాంతంలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి ఓ యువకుడిపై హత్యాహత్యానికి పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ తెలిపారు. సోమవారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ డబ్బుల విషయంలో ఆశా సంతోష్‌కుమార్‌పై గొర్ల అఖిల్, కామెర రాజు, గడ్డం మదన్‌కుమార్ కత్తి, బీరు సీసాలతో పాడవడంతో తీవ్రగాయాలయ్యాయి. సంతోష్‌కుమార్ తల్లి మల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో టూటౌన్ ఎస్సై రంగు తిరుపతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో నలుగురు..

బేల: మండలంలోని డోప్టాలలో ఈ నెల 8న కుంచల విఠల్ ఇంట్లో జరిగిన చోరీ కేసులో నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జైనథ్ సీఐ సాయినాథ్ తెలిపారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుంచల్వార్ అభినవ్, బుసే బడిరాం చోరీకి పాల్పడినట్లు గుర్తించామన్నారు. నిందితుల వద్ద నుంచి 3 తులాల బంగారు, 10 తులాల వెండి ఆభరణాలు, రూ.14,200 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో ఎస్సై దివ్యభారతి, ఏఎస్సై కనక జీవన్‌కుమార్, సిబ్బంది ప్రభాకర్, రాజు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రమోద్‌రావు

మంచిర్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఈ నెల 8న జరిగిన మహిళ హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేదరీవాడకు చెందిన మిట్టపల్లి వీరాస్వామి కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన తీగల భాగ్యతో మూడేళ్లుగా సహజీవనం చేస్తున్నాడు. ఈ నెల 8న మద్యం మత్తులో భాగ్యతో గొడవపడి బండరాయితో తలమీద బాదడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి సోదరి సంపతి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

గొలుసు అపహరణ



బాధితురాలు లక్ష్మి

భైంసాటౌన్: ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా ఓ వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు అపహరించిన ఘటన సోమవారం పట్టణంలోని బస్టాండ్‌లో చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. కుభీర్‌కు చెందిన లింగంపల్లి లక్ష్మి(60) భైంసా బస్టాండ్‌లో కుభీర్ బస్సు ఎక్కుతుండగా, గుర్తు తెలియని దుండగుడు గొలుసు (తులం నర) దొంగిలించాడు. కొద్దిసేపటికి మెడలో గొలుసు లేకపోవడాన్ని గమనించిన వృద్ధురాలు లబోదిబోమంది. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొంది.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గాదిగూడ మండలం శివన్నారా గ్రామానికి చెందిన రాజు అంగన్‌వాడీ సెంటర్, సీసీరోడ్డు మంజూరు చేయించాలని, బేల మండలం గణేశ్‌పూర్ గ్రామానికి చెందిన మడావి లస్మా ఎడ్ల జత ఇప్పించాలని, సిర్పూర్(యూ) మండలం మెట్టిగూడకు చెందిన పెందూర్ భువనేశ్వర్ ఇందిరమ్మ ఇల్లు, భీమిని మండలం కర్జిభీంపూర్ గ్రామానికి చెందిన టేకం పోషన్న బోర్‌వెల్ మంజూరు చేయాలని కోరారు. ఇంకా వివిధ సమస్యలపై ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో ఏపీవో వసంత్‌రావు, ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థినులు

నేరడిగొండ: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్–17 సాఫ్ట్‌బాల్ పోటీల్లో నేరడిగొండ కేజీబీవీ విద్యార్థినులు ఆరుగురు కాంస్య పతకాలు సాధించినట్లు ప్రత్యేక అధికారి రజిత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థినులు ఆర్.శ్రీలేఖ డి.శిరీష జె.అనిత, టి.శిరీష, ఎం.శ్రీనిత్య బి.వనితను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ స్నేహ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

11న క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు

మంచిర్యాలటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11న అండర్–14 క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ కోదాటి ప్రదీప్, కోచ్. ప్రదీప్ తెలిపారు. క్రీడాకారులు మంచిర్యాల పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలోని క్రికెట్ నెట్‌లో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని సూచించారు. 1 సెప్టెంబర్ 2010 తర్వాత పుట్టినవారు పోటీలకు అర్హులని, మరిన్ని వివరాలకు 9440010696 నంబరులో సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఇచ్చోడ: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థినులు సింధుజ, అంజలి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రోజారాణి తెలిపారు. ఈ నెల 7 నుంచి 11 వరకు హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించనున్న 71వ సీనియర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నట్లు ఆమె పేర్కొన్నారు.